క్లుప్తంగా

మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



హుజూర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న నాగన్న తదితరులు

హుజూర్‌నగర్ : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పుట్టినరోజు వేడుకలను సోమవారం హుజూర్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీర్ మల్లిఖార్జున్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అమర్నాథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి, పట్టణ అధ్యక్షుడు పాశం రామరాజు, యూనియన్ నాయకులు సలిగంటి జానయ్య, కాల్వ పెద్దవెంకటేశ్వరావు, చీకూరి అంజయ్య పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : ఈనెల 23న చేపట్టే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రాఖి, ఉమేష్, విష్ణు, గౌతమ్, వేణు, కిరణ్ పాల్గొన్నారు.

శివాలయంలో 'స్వచ్ఛ' ఆడిటర్స్ పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభుశంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని సోమవారం కేంద్ర స్వచ్ఛ పరిరక్షణ ఆడిటర్స్ మురళీస్వామి, సలీం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించి స్వామి విశిష్టతను వివరించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, పూలమాలతో ఆడిటర్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, ఆలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులు శ్రీనివాసరావు, శంభయ్య, గోవిందరెడ్డి, చందర్‌రావు, గణేష్, నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చిన్నబాబు, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

మఠంపల్లి: మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషిచేయాలని ఆ పార్టీ మఠంపల్లి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మఠంపల్లిలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అధిక స్థానాల్లో గెలుపొందేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో ఆపార్టీ మండల నాయకులు శివాజీనాయక్, నాగునాయక్, బాబునాయక్, స్వామినాయక్, రమేష్‌నాయక్, సైదానాయక్, మురళీధర్‌రావు, శీలం కవిత, గుండెపంగు కొండలు, మహేశ్వర్ రెడ్డి, నరసింహారెడ్డి, గోపాల్‌యాదవ్, సాంబ, శ్రీనివాసరెడ్డి, సక్రునాయక్, శివ పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త ఇమామ్ మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : మండలంలోని కరక్కాయలగూడేనికి చెందిన సామాజిక కార్యకర్త షేక్ ఇమామ్ సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బత్తిని మాధవరావు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగరి సత్యనారాయణ, నాయకులు అంకతి ప్రభాకర్, మచ్చా వెంకటేశ్వర్లు, అంకతి లక్ష్మీనారాయణ, కస్తాల రామయ్య, చింతకుంట్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వన్ డే సైంటిస్టులుగా 'మోడల్' విద్యార్థులు



శాస్త్రవేత్తలతో విద్యార్థులు, ప్రిన్సిపాల్

నడిగూడెం : 'మన్‌కీ బాత్'లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ల్యాబ్‌ల కార్యక్రమంలో నడిగూడెం మండలం కరివిరాల మోడల్ స్కూల్ విద్యార్థులకు వన్ డే సైంటిస్ట్ గౌరవం లభించినట్లు ప్రిన్స్‌పాల్ సాయి ఈశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో తనుశ్రీ, భసీరత్ నఫీసా, మనోజ్‌రెడ్డి సీఎస్ఐఆర్, సీసీఎంబీ ల్యాబ్‌ను సందర్శించి పలువురు శాస్త్రవేత్తలు, డైరెక్టర్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. దీంతో ఆ విద్యార్థులకు వన్ డే సైంటిస్టులుగా గౌరవం లభించింది. విద్యార్థులను ప్రిన్స్‌పాల్‌తోపాటు కోచ్ శేఖర్, గైడ్ టీచర్ నాగరాజు అభినందించారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్లు!

- ఫైలెట్ గ్రామమైన ఆర్లెగూడెంలో నిర్మాణాలపై ఆసక్తిచూపని లబ్ధిదారులు
- మంజూరైన ఇళ్లు 154.. నిర్మాణాలు చేపట్టినవి 28 మాత్రమే
- పథకం నిబంధనలు సడలించకపోవడమే కారణం
- రేకుల ఇళ్లపై స్లాబ్‌లకు అవకాశమివ్వాలంటున్న కొందరు



చిలుకూరులో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు

చిలుకూరు: మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన ఆర్లెగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ గ్రామానికి 154 ఇళ్లు మంజూరు కాగా కేవలం 28 ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే నిర్మించుకుంటున్నారు. మిగతా వారు మాత్రం పథకం నిబంధనలు కఠినతరంగా ఉండడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేక పోతున్నామని పేర్కొంటున్నారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభించిన వాటిలో కూడా రూఫ్‌లెవల్ 5, స్లాబ్ లెవల్‌లో 5, బేస్మెంట్ లెవల్‌లో 10 ఇళ్లు ఉండగా, పునాదుల దశలో మరో 8 ఇళ్లు ఉన్నాయి. ఇందులోనూ పది ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా.. మిగిలిన 18 ఇళ్ల నిర్మాణాలు మందగించాయి.

పథకం నిబంధనలు సడలించాలని..

ఆర్లెగూడెంలో ఇళ్లు మంజూరు కానివారు మంజూరు చేయాలని ఒకపక్క డిమాండ్ చేస్తుండగా.. పథకం నిబంధనలు కఠినతరంగా ఉండడంతో తాము నిర్మించుకోలేకపోతున్నామని మంజూరైన వారు అంటున్నారు. ప్రస్తుతం రేకుల గదుల్లో ఉంటున్న వారు రేకులు తీసివేసి స్లాబ్ వేసుకుంటామంటే అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు ముందస్తుగా మెటీరియల్ తెచ్చుకునేందుకు కూడా డబ్బులు లేక ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. నిబంధనలు సడలించి ఉన్న గోడలపై స్లాబ్‌లు వేసుకునేలా అవకాశం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రూ.5 లక్షల వ్యయంతో నమూనా ఇల్లు నిర్మించాం



చిలుకూరులో రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మించాం. అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే హౌసింగ్ శాఖకు అప్పగిస్తాం. లబ్ధిదారులంతా నమూనా ఇంటి ఆధారంగా ఇళ్లు నిర్మించుకోవాలి.

– జేఎస్ఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ

చిలుకూరులో పూర్తయిన నమునా ఇల్లు

చిలుకూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మూడు నెలల క్రితం చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయ్యింది. రూ.5 లక్షల వ్యయంతో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక హాల్, బెడ్‌రూం, వంట గది, టాయిలెట్స్ గది నమూనా ఇంటిని నిర్మించారు. ఈ ఇంటిని చిలుకూరు మండలం హౌసింగ్ ఏఈ కార్యాలయానికి కేటాయించారు. అయితే అధికారికంగా ఆ శాఖకు ఇంకా అప్పగించలేదు. కాగా నమూనా ఇంటి నిర్మాణం ఆధారంగానే మండలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది.

పోలీస్‌స్టేషన్ భవనం పూర్తిచేయిస్తా..



చిలుకూరు : స్టేషన్ భవన నిర్మాణం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



నేరేడుచర్ల : వెంకట్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

చిలుకూరు: చిలుకూరు పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయిస్తానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం చిలుకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా మధ్యలో నిలిచిపోయిన స్టేషన్ నూతన భవనాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. అనంతరం చిలుకూరులో ఇటీవల మరణించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంకెన సత్యమయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.

తనూష మహాలక్ష్మి మృతి బాధాకరం

మునగాల : తనూష మహాలక్ష్మి మృతి బాధాకరం అని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. నడిగూడెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతూ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన నిమ్మ తనూష మహాలక్ష్మి కుటుంబాన్ని సోమవారం కలకోవలో ఎమ్మెల్యే పరామర్శించారు. మహాలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మృతిపై సమగ్ర విచారణ జరపాలని సీఐ రామకృష్ణారెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, నల్లపాటి శ్రీనివాసరావు, వీరబాబు, పనస విజయ్, సాయి, శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

నేరేడుచర్ల : ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, నీటి సంఘం మాజీ డైరెక్టర్ నూకల వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి చిత్రపటటానికి నివాళులర్పించారు. మృతుడి భార్య రమ, కుమారుడు ఎలెన్‌రెడ్డిని పరామర్శించారు. ఆమెవెంట కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కణతం చినవెంకట్‌రెడ్డి, నూకల సందీప్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సురేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, ఇషియాక్ శ్రీను, సత్యనారాయణరెడ్డి, శివ ఉన్నారు.

గోరింటాకు పండుగ



హుజూర్‌నగర్‌లోని రామాలయంలో గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో సోమవారం మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు రంగభట్రాచార్యలు, మురళీకృష్ణమాచార్యులు, దామోదరాచార్యులు, ఏఎంసీ చైర్‌పర్సన్ దేశ్‌ముఖ్ రాధిక, మహిళలు కొత్త కళావతి, వంకాయల పద్మ, భారతమ్మ, పిచ్చమ్మ, వెన్న పద్మ, కామిశెట్టి కళావతి, ఆరేటి లక్ష్మి, పి.సోమలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

మోతె : మోతె మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్ ఫస్టియర్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రత్యేకాధికారి క్రాంతికుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005–26 విద్యా సంవత్సరానికి (ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఫీమేల్), ఎంఎల్‌టీ ఒకేషనల్ గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థినులు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు విద్యాలయంలో సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.

మోతె ఎస్ఐగా అజయ్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న అజయ్‌కుమార్

మోతె : మోతె నూతన ఎస్ఐగా అజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన యాదవేందర్‌రెడ్డి బదిలీపై సూర్యాపేట వీఆర్‌కు వెళ్లారు. దీంతో ఇటీవలే శిక్షణ పూర్తిచేసుకున్న అజయ్‌కుమార్‌కు మొదటి పోస్టింగ్‌గా మోతె ఎస్ఐ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతె మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

ఆనవాళ్లు కోల్పోతున్న ఎన్నెస్పీ కాల్వలు



దుంగగడ్డి, కంపచెట్లతో మూసుకుపోయిన కందిబండ మేజర్ కాల్వ

మేళ్లచెరువు : మండలంలోని సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మేజర్, మైనర్ కాల్వలు ఆక్రమణకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఇరిగేషన్ సిబ్బంది పర్యవేక్షణ లోపించడంతో కొందరు రైతులు కాల్వ గట్టు స్థలాలను ఆక్రమించి తమ పొలాల్లో కలుపుకుంటున్నారు. దీంతో రైతులు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు కాలువ్లో కంపచెట్లు, దుంగగడ్డి మొలవడంతో నీరు సాఫీగా పారడం లేదు.

పలుచోట్ల ధ్వంసం

మండలంలో ప్రధానంగా కందిబండ మేజర్ కాల్వ గ్రామ శివారు వరకు వచ్చేసరికి ఆనవాళ్లు కూడా లేకుండా ధ్వంసమై ఉంది. రామాపురం మేజర్ కాల్వ కప్పలకుంటతండా వద్ద పిల్లకాల్వను తలపిస్తోంది. కాల్వలు కంపచెట్లు, మట్టితో పూడిపోయి ఉన్నాయి. గుండ్లపల్లి మేజర్ మేళ్లచెరువు పరిధి దాటే వరకు ఆనవాళ్లు కోల్పోయి స్థానికంగా ఉన్న ఓ సిమెంటు పరిశ్రమకు వెళ్లేవాళ్లకు రోడ్డుగా మారింది. కాల్వల్లో పూడికలు తీయించి, ఆక్రమణకు గురికాకుండా కాపాడడంతోపాటు ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగుకు సాఫీగా నీరందించాలని చివరి భూముల రైతులు కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల : ఎన్నికల మందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలపైన నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో సర్పంచ్‌లు లేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేశ్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు నాగండ్ల శ్రీధర్, చందమళ్ల జయబాబు, చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, అనంతు శ్రీనివాస్, రాపోలు నవీన్ కుమార్, హుసేన్, సుందర్శన్, శ్రీను, కోటి, రవిందర్, సైదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

పాలకవీడు: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల ఎన్నికలపై సోమవారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, పసుపులేటి సైదులు, రాగిరెడ్డి లక్ష్మారెడ్డి, రామారావు, మహమూద్‌అలీ, వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గరిడేపల్లిలో కార్యకర్తల సమావేశం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ తెలిపారు. సోమవారం గరిడేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భారీ వర్షం.. రోడ్లు, వీధులు జలమయం



నడిగూడెం-బరాఖత్‌గూడెం రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



నడిగూడెం బీసీ కాలనీలో..

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి. నడిగూడెం మండల కేంద్రం నుంచి మునగాల మండల బరాఖత్‌గూడెం వెళ్లే రోడ్డుపై భారీగా వరద ప్రవహించింది. గుంతలు ఉండడంతో అక్కడక్కడా వర్షపు నీరు నిలిచింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే నడిగూడెం బీసీ కాలనీలో పలు వీధుల్లోనూ నీరు నిలిచింది. భారీ వర్షం కురవడంతో మెట్ట పంటలకు ప్రాణం పోసినట్టయ్యిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్నల్ సంతోష్‌బాబు కుటుంబానికి ఆర్థికసాయం

సూర్యాపేట : దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్‌బాబు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని యోగా సిందూర్ ఫౌండర్ యోగా నారాయణ, ప్రెసిడెంట్ శివదుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం యోగా సిందూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతోష్ బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులు ఉపేంద్ర, మంజులకు రూ.లక్ష చెక్కు అందజేసి మాట్లాడారు. యోగా సిందూర్ ద్వారా వచ్చిన రూ.3,31,570లను దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాలకు అందజేస్తున్నామని తెలిపారు. మరో రూ.లక్షను మురళీనాయక్ కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు. అనంతరం సంతోష్ బాబు తల్లిదండ్రులు ఉపేంద్ర మంజులను, కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్య చారి సతీమణి శారదను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీర జవాన్ కుటుంబ సభ్యులు, యోగా గురువులు, విద్యుత్ శాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వరరావు, అనిల్ కుమార్, వెంగళరావు, ప్రవీణ్, అశోక్ కుమార్, రాము, శ్రీనివాసరావు, పాపిరెడ్డి, కంది భజరంగ్ ప్రసాద్, మమత, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కల్నల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న యోగా సిందూర్ ఫౌండేషన్ సభ్యులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కోదాడ: జిల్లాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు కోరారు. కోదాడలోని సుందరయ్య భవనలో సోమవారం జరిగిన ఆ పార్టీ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి లోపించిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మిట్టగడుపుల ముత్యాలు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రాపోలు సూర్యనారాయణ, అలసగాని బ్రహ్మయ్య, నాగాటి రాములు, వి.నారాయణ, దాసరి శ్రీను, కిరణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ అజయ్‌కుమార్

నడిగూడెం : సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్ఐ గంధమళ్ల అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లా పోలీస్ వ్యవస్థ షీ టీమ్స్, సైబర్ నేరాల నియంత్రణపై నిఘా పెట్టిందన్నారు. ప్రతి స్కూల్, కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. అనంతరం పలువురు పోలీస్ కళాకారులు పలు సామాజిక కార్యక్రమాలపై ఆటాపాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ వాణి, కోదాడ షీ టీమ్ మహిళా కానిస్టేబుల్ జ్యోతి, పోలీస్ సిబ్బంది నరేష్, కళ్యాణ్, గోపి, పోలీసు కళాజాత బృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, చారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో ఫల పుష్పార్చన



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ, భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలికంద ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో సోమవారం బహుళ ఏకాదశి సందర్భంగా సహస్రనామ ఫల పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు హరీష్ కుమారాచార్యులు, శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వై.గురవయ్య, ధర్మకర్తలు హరీష్ కుమార్, కృష్ణ ప్రసాద్, అంజయ్య, నరసింహారావు, హనుమంతరావు, కవిత, ఈఓ లక్ష్మణరావు, యరగాని గోపాలం, ఎలమంచమ్మ, సురభి సైదులు, శాంతమ్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జతిన్‌రెడ్డి

కోదాడరూరల్: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ రమా సోమిరెడ్డి సోమవారం తెలిపారు. అండర్–11 బాలుర విభాగంలో పశ్య జతిన్‌రెడ్డి (5వ తరగతి) ప్రథమస్థానం, గోపిరెడ్డి విక్రాంత్‌రెడ్డి (7వ తరగతి) ప్రత్యేక బహుమతి, అండర్–13 బాలికల విభాగంలో యోగితా (6వ తరగతి) ప్రథమ, అండర్–11 విభాగంలో అద్వైత (5వ తరగతి) ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ సంఘం జిల్లా కన్వీనర్ బొలిశెట్టి భాస్కరమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేక తీవ్ర ఇబ్బందులు అవుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, జయమ్మ, మంజుల, వజ్రమ్మ, సుజాత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొలిశెట్టి భాస్కరమ్మ

వైభవంగా తీజ్ వేడుకలు



కిందితండాలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

మఠంపల్లి: మండలంలోని కిందితండా, చెన్నాయిపాలెం గ్రామాల్లో సోమవారం గిరిజన మహిళలు, యువతులు, గ్రామ పెద్దలు తీజ్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోధుమ నారు బుట్టలతో ప్రదర్శనగా వచ్చి గిరిజన పెద్దల ఇళ్ల వద్ద పెట్టి వాటిచుట్టూ ఆడుతూ పాడారు. అనంతరం గ్రామ శివారు వాగుల్లో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కింది తండా గ్రామ మాజీ సర్పంచ్‌లు భూక్యా మారోని, భూక్యా నాగు నాయక్, భూక్యా భరత్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ విజయానాగు నాయక్, తండా పెద్దలు హుస్సేన్‌నాయక్, నాగేశ్వరరావు, వెంకటేష్ నాయక్, కోట్యా, నాగేశ్వర నాయక్, చెన్నాయిపాలెంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యామంజీనాయక్, సేవాలాల్ ఉత్సవకమిటీ అధ్యక్షులు తుల సీరామ్‌నాయక్, గ్రామ పెద్దలు శ్రీనునాయక్, నాగేశ్వరరావు, రవీందర్, గోవర్ధన్ నాయక్, చిటూ, వీరన్న, బజ్జా, సైదా, మగతా, జగ్గు, రామా, సేవా, సక్రు, మాంగూ, గాంగ్యా నాయక్, మహిళలు, యువతులు, బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.